# నిజానిజాలు

ప్రస్తుత సామాజిక, ఆర్థిక వ్యవస్థలనే పగ్గాల ఉచ్చుల్లో చిక్కుకుని, ఊపిరి ఆడక క్షణమొక యుగంగా గడిపే దురదృష్టవంతుల స్వీయ చరిత్రలు 'బరువుగుండెలు' శీర్షికద్వారా ప్రకటిస్తూ, సమస్యా పరిష్కారానికి పూనుకోగల ఉదాత్తహృదయులకు ఒక అవకాశం కలిగిస్తున్నందుకు మీకు నా కృతజ్ఞత.

బతుకుబాటలోని కఠినశిలల ఎదురుదెబ్బలతాకిడికి నాబతుకే భయంగా మారింది. నా చిన్నతనంలోనే మా నాన్న మరణించాడు. ఎనిమిదో ఏటనే వివాహ వైధవ్యాలు సంప్రాప్తించాయి. సంసారం గడిపే ఆధారంలేదు. అప్పటిదాకా ఎన్ని కష్టాలు వచ్చినా గడప దాటకుండానే గడుపుకుపోయిన మా అమ్మ పరాయివాళ్ళ నాలుగు రాళ్ళకోసం ఊడిగం చేయాలిసొచ్చింది. 'వంటమనిషి' బిరుదు పొందింది. ఎన్నో అవమానాలకి, అధికారాలకి తల వొంచింది. ఇదంతా నా కోసం. ఇంటర్మీడియేట్ రెండో సంవత్సరం సగంవరకూ అష్టకష్టాలుపడి చెప్పించింది. చివరికి మందు కొనటానికి డబ్బులేక ఈ లోకంలో కష్టాలకి తుది ఉద్వాసన చెప్పింది. ఏమీ చెయ్యలేకపోయాను. 'మరి బాధలుపడే అవసరం ఆమెకి తీరిపోయిం'దని మనసుని ఊరడించుకున్నాను.

ఇహ ఇంటర్ పూర్తిచెయ్యటం కలలోకూడా అసంభవం. జీవితంలో ముందుకి అడుగు ఎలా పడటం? ఈ క్లిష్టపరిస్థితిలో మరో కొత్తసమస్య ఎదురైంది. మేము ఉంటూవున్న ఇంటి యజమానిదగ్గర మా అమ్మ అప్పుడప్పుడు తీసుకున్న చిన్నచిన్న అప్పులన్నీ కలిపి రెండువందలయినయట. మా అమ్మ ఆఖరిక్షణాల్లో ఆయన వచ్చి ఏదో కాగితంమీద వేలుముద్రవేయించుకుని వెళ్ళాడు. అప్పుడు నేనా విషయం పట్టించుకోలేదు. ధర్మాత్ముడు, ఆ రెండువందలు వదిలేస్తాడుటగాని. ఒక షరతు ఉందిట. ఆయన ప్రథమ భార్య, ఆయననీ, ఇద్దరు పిల్లలనీ వదిలి పరలోకం వెళ్ళిపోయిందిట. ఆ పిల్లల్ని పెంచటానికి రెండోపెళ్ళి తప్పనిసరి కాబట్టి నన్నందుకు ఒప్పుకోమని ఆయన కోరాడు. అలా అయితే రెండువందల బాకీ చెల్లిపోతుంది. లేకపోతే సదరు

బాకీ అసలు ఫాయిదాల వసూలు నిమిత్తం కోర్టులో దావా పడబోతుందనీ, అందునిమిత్తం కాగల ఖర్చులుకూడా భరించుకోవలసి ఉంటుందనీ రిజిష్టర్డ్ నోటీసు అందుతుందిట.

ఏ దిక్కుకి తిరగను? కాలేజీ యువకులు చాలామంది నా మీద 'ప్రేమ' ని వెలిబుచ్చారు. ఒకాయన ఆత్మహత్యకూడా చేసుకుంటానని అల్టిమేటమ్ ఇచ్చాడు. 'నిజంగా ప్రేమిస్తున్నారా?' అని అడిగాను. 'ప్రాణాధికంగా' అన్నాడు.

"ప్రేమ అంటే ఏమిటి?"

జవాబు చెప్పలేక పోయాడు.

"విధవా వివాహం మీ కిష్టమేనా?"

తెల్లబోయాడు. మళ్ళీ కనిపించలేదు. మరో ప్రబుద్ధుడు షేవ్ చేసుకుంటూ ఉంటే తెగింది కాబోలు. రక్తంతో రాశాడు. "నిన్ను ప్రేమిస్తున్నాను" అని, కారిన నెత్తురు సద్వినియోగం చెయ్యాలనుకున్నాడేమో!" కళ్ళలోకి చూడమన్నారు." బెదిరి పారిపోయాను "ఇలాంటి అమ్మాయికి పెళ్ళి ఏమిటో అనుకున్నారు. అని ప్రచారం చేశారు. నా సహాధ్యాయినులు నవ్వుకున్నారు. అంతా యింతే. ఎవరిని నమ్మను?

చదువులేక, డబ్బులేక, ఆప్తులులేక, స్వార్థపరులతో నిండిన ఈ ప్రపంచంలో ఏకాకిగా, నిస్సహాయంగా ఎలా బ్రతకను? అనేక సుడిగుండాలతో నిండిన ఈ సముద్రం ఎలా ఈదటం? ఈ కష్టాల కంతటికీ మూలకారణం దారిద్ర్యమే కదా! డబ్బువుంటే ఏ బి. ఏ. వరకో చదివి స్వతంత్రంగా బ్రతకటానికి ఒకదారి యేర్పడేది! చుట్టూవున్న సంఘం సౌహార్ద్రంగా ఉన్నా సమస్యలు వీడిపోయేవి. కాని సమాజం ఎంత అధోగతికి పోగలదో అంత వరకూ పోయింది. ఎన్నో 'కుక్కమూతి పిందెలు' వేస్తోంది.

నాలాంటివాళ్లు చాలామంది ఉన్నారని నాకు తెలుసు. కలగజేసుకోటానికి ప్రభుత్వానికి డబ్బూ, ఓపికాకూడా లేదని తెలుసు!

ఆర్థిక విప్లవానికి ముందు అత్యావశ్యకంగా రావలసిన భావవిప్లవంకోసం యువకులు తీవ్రమైన ఉద్యమం నడిపిస్తారనీ, ముందుతరాలవాళ్ళయినా బాగుపడగలరనీ ఆశించటంకంటె ఏం చెయ్యగలను?

పుట్టుకతో వచ్చిన మానవ సహజమైన లోపాలూ, బాధలూ ఉండనే ఉన్నాయి. కనీసం మన చేతుల్లో ఉన్నంతవరకైనా మనని మనం బాగుచేసుకో

లేమా? మనం సృష్టించిన దెబ్బా, మనం విధించుకున్న నిబంధనలూ మన మీద స్వారీ చెయ్యటం చూస్తూ ఊరుకోటంకంటె మనం యేమీ చెయ్యలేమా?

—రాధ.

వరదరాజు కల్లోలితమైన మనసుతో సముద్రంవైపు చూశాడు. మళ్లీ దృష్టి మరల్చి గాలికి రెపరెప కొట్టుకుంటున్న, ఆ అచ్చుకాగితం వైపు చూశాడు. తరువాత ఆకాశంలోకి కళ్ళు ఎత్తాడు. అకస్మాత్తుగా సూర్యుడు అస్తమించబోతున్నాడు. అతనికి భయమేసింది. ఈ సుందరమయ ప్రకృతినించి సూర్యుడు వేరవుతున్నాడు. తనవైపు పరుగెత్తుకుంటూ వస్తున్న అలలవైపు మళ్లీ చూశాడు వరదరాజు. అప్రయత్నంగా వెనక్కి రెండడుగులు వేశాడు.

ఆ క్షణంలో వరదరాజుకి ప్రకృతి ఎంతో ఆకర్షణీయంగా, అత్యద్భుతంగా, నిరుపమానంగా కనిపించింది. తను ఇన్నాళ్ళనుంచీ అంత గుడ్డివాడుగా ఎలా ఉండగలిగాడు?

అలలమీద పసుపుగా మెరుస్తున్న సూర్యకాంతి క్రమంగా అంతరిస్తోంది. వరదరాజు అది గమనించి విచారంగా నవ్వాడు. 'అంతే, క్షణికం' అనుకున్నాడు. కాని వెంటనే అతని మనసులో మెరుపు మెరిసింది.

"మళ్లీ రేపు సూర్యోదయం అవుతుంది. ఆ కాంతికి ఈ అలలు వెండి నీరులా మెరుస్తూ ఆనందంతో ఆటలాడుకుంటాయి."

వరదరాజు మనసు సందిగ్ధావస్థలో పడ్డది.

"జీవితం ఉదయాస్తమానాల గతిచక్రం. అస్తమించిన సూర్యుడు మళ్లీ అవతరిస్తాడు. కాలగమనంతో కలిసిపోయి మార్పుకి అలవాటు పడటం మానవ ధర్మం." పురాతనపు జ్ఞాపకాలు వరదరాజు మనసులో మెసిలాయి; వర్తమానపు ఉద్రేకాలు మనసుని ఆవరించాయి. అతను ఆలోచనగా వెనక్కి తిరిగాడు. చేతిలోని కాగితం సంగతి గాలి జ్ఞాపకం చేసింది. క్షణంలో అతని ముఖం వివర్ణమయింది. తను యేం చెయ్యదల్చుకున్నాడు? యేం చేస్తున్నాడు? సమాధానం యేవిధంగా చెప్పగలడు?

ఇంకా గతకాలని తనని ఎవరు బలవంతం చేస్తున్నారు? అన్ని ఆకర్షణలూ పోయాయనుకున్న తనకి ఇంకే ఆకర్షణ మిగిలింది? ఎందుకు మళ్ళీ వెనక్కి......

వరదరాజు సముద్రంవైపు నడిచాడు. పెద్ద అల వస్తోంది. అప్రయత్నంగా పంచ పైకి లాక్కున్నాడు. వెంటనే అతనికి నవ్వొచ్చింది. వెధవ బ్రతుకు! ఎందుకింత ఆపేక్ష?

అలవచ్చి అతని కాళ్ళని తడిపింది. అతను ఇంకా ముందుకి నడిచాడు. కర్తవ్యం ముందుకు తోస్తోంది. బ్రతికినన్నాళ్లూ ఎవర్నీ సుఖపెట్టలేదు తను. ఒక్క జీవిఅయినా తనవల్ల సుఖపడితే......

పెద్ద అలవచ్చి కొట్టుకుంది. పంచ తడిసింది. చేతిలో కాగితం కొట్టుకుపోయింది. ముందు అగాధంలా సముద్రం తననీడికి పరుగెత్తుతోంది....కాగితాన్ని సముద్రం నీళ్ళ అడుగున దాచేసింది. కాగితం కోసం చూశాడు అతను. కనపడలేదు. పెద్దఅల... కొద్దిక్షణాలు... కళ్ళుమూసుకున్నాడు అతను. కాని ఉండలేకపోయాడు. వెనక్కి పరిగెత్తాడు. అలవొడ్డుకు వచ్చి విరిగిపోయింది. మళ్ళీ వెనక్కి వెళ్ళిపోతూ అతని కాళ్ళముందు ఆ కాగితం పడేసి క్రమంగా నీళ్ళలో కలిసిపోయింది.

వరదరాజు ఆ కాగితంవైపు అలాగే చూశాడు. తరువాత దాన్ని తీసి మళ్లీ జాగ్రత్తగా జేబులో దాచాడు. అతని పిరికితనానికి అతనికే అసహ్యం వేసింది. మనసు సంక్షోభం చెందింది. ఇంత చేతకానివాడు అనుకోలేదు తను. తనలో ఇంత స్వార్థం ఉందనికూడా ఎప్పుడూ తెలుసుకోలేకపోయాడు. సామర్థ్యం లేనప్పుడు నడుం బిగించి ముందుకి ఎందుకు ఉరకాలి తను? అతనికి వెంటనే ఒక అనుమానం కలిగింది తను రాధని చూడకముందు ఇంత దుర్బలుడు కాదేమో! రాధ! రాధకోసం చావాలనుకున్నాడు. కాని...

అతను ఆలోచిస్తూ నడుస్తూ ఒక ఇంటి గుమ్మంముందు ఆగాడు. తలుపు తట్టబోయి మళ్లీ తటాలున ఆగిపోయాడు. తను అసలు ఇక్కడికెందుకు ఎలా వచ్చాడు? బుద్ధిపూర్వకంగా రావాలని అనుకోలేదు. కళ్లూ, కాళ్ళూ అంతరాంతరాలతో సరేకా? ఒక క్షణం అలా నిలబడి వరదరాజు వెనక్కి తిరిగి చరచర నడిచిపోయాడు. అతను ఆ ఇల్లుదాటి పదిఅడుగులు వేశాడో లేదో, ఆ ఇంటితలుపు తెరుచుకుంది. రాధవీధి వాకిటనుంచుని యథాలాపంగా ఇంటి ముంగిటచూసే సరికి పాదాల గుర్తులు కనిపించాయి. అవి తనవి మట్టుకు కాదు. ఒక గంటక్రింద కొద్దిగా కురిసి వెలిసిన వాన ఆ విషయం స్పష్టంగా చెబుతోంది. ఇంటివరకూ వచ్చి తనని పిలవకుండా ఆ పెద్దమనిషి ఎవరు ఎందుకు వెళ్ళిపోయాడో అర్థంకాక ఆమె తలెత్తి వీధివైపు చూసింది.

వరదరాజు బరువుగా అడుగులో అడుగు వేసుకుంటూ వెడుతున్నాడు. రాధ గుండె వేగంగా కొట్టుకుంది. సందేహంలేదు. అతను వరదరాజే. వెనక్కి దువ్విన క్రాఫు, ఖద్దరు గుడ్డలు, ఆ నడకతీరూ-సర్వస్వం పోగొట్టుకున్న వాడిలా ఎప్పుడూ బరువుగా అడుగులువేసే ఆ స్వరూపం, అతను వరదరాజే నని ఘంటాపథంగా చెబుతున్నాయి. రాధ అతనివైపు కన్నార్పకుండా అలాగే చూడసాగింది. విరాగిలా సాగిపోతున్న అతన్నిచూసి ఆమెకి ఒక క్షణం జాలివేసింది. మరుక్షణంలో ఆమె హృదయం కంపించింది. ఏ తలపైతే తను జ్ఞాపకం తెచ్చుకోకుండా ఉండటానికీ, ఏ నిజమైతే తను అబద్ధం మాత్రమేనని అసహజంగా నమ్మపెట్టుకోటానికి ప్రయత్నిస్తోందో ఆ తలపు, ఆ నిజం వెంటనే ఆమె స్మృతిలో మెరుపుల్లా మెరిశాయి. వరదరాజు తన భర్త.

రాధ శూన్యంగా అతనివైపు చూస్తూ నిలబడింది. వరదరాజు క్రమంగా దూరమవుతున్నాడు. ఆమె హృదయంలో ఏమూలో దాగిన ఆశా భావం క్రమంగా అదృశ్యమౌతున్నట్లుగా ఆమె అనుభూతి పొందింది. క్షణం సేపు లోకంలో తనకంటె మూర్ఖురాలు ఎవరైనా ఉన్నారా అనే సందేహం కలిగిందామెకి. అసలు తను పత్రికలో 'స్వీయచరిత్ర' ఎందుకు రాయాలి? అంతకంటె సముద్రంలోపడి చచ్చిపోతే బావుండేది? రాధ మనసులో గతిం చిన సంఘటనలు ప్రతిబింబించాయి. వరదరాజు తనని ఉద్ధరించటానికి వచ్చిన దేవుడనుకుంది. ఎందుకో అతన్ని చూడగానే తనకి అతనిమీద సదభిప్రాయం కలిగింది. కాని మనస్సు ఇలా వంచిస్తుందని ఏ మాత్రం సూచనగా తెలిసినా...

"పత్రికలో మీ దైన్యచరిత్ర చదివాను" అన్నాడు అతను. అతని ముఖం లోను వ్యక్తమైన సానుభూతికి హృదయంలో నిండిన దయతో సంబంధం లేదనుకోటానికి తగిన ఆధారం ఏమీ తనకి దొరకలేదు.

"నాలాంటివాళ్లు ఎంతమందో?"

అతను కొంచెంసేపు ఏమీ మాట్లాడలేదు. తరువాత సూటిగా ఉపో ద్ఘాతం ఏమీ లేకుండా అన్నాడు.

"నేను యథాశక్తిని మీకు సహాయం చెయ్యదల్చుకున్నాను"

తను యేమీ మాట్లాడలేకపోయింది. హృదయంలో కృతజ్ఞతాభావం నిండి, తొణికి తన ముఖంలోనించి బయటికి వస్తోందని అతను గ్రహించటా

నికికూడా అవకాశంలేదు. అతను తనవైపు చూసి మాట్లాడటం లేదు. రాగానే యే ఒక్కసారి చూశాడో అంతే. పాపం, ఎంత స్వ్రమత !

"అయితే ఇందుకు మీ సహాయం చాలా అవసరం"

"యేం సహాయం ?" తనకే వినపడకుండా అన్నది.

"చెబుతాను. నన్ను చూస్తే మీకు ఎలాంటి అభిప్రాయం కలుగుతోంది ?"

"మీరు చాలా మంచివారు. ఇతరుల కష్టసుఖాలు వినిపించుకోటానికే టైంలేక స్వార్థంవెంట పరిగెత్తే మనుష్యుల్లో మీలాంటి ఆదర్శవాది ఉండటం"

"పొగడకండి, నేను అడిగింది అదికాదు. నేను ప్రపంచంతో సంబంధం ఉన్న మనిషిలా కనిపిస్తున్నానా ?"

"చాలా నిర్లక్ష్యంగా ఉన్నారు. కారణం యేమిటో—"

"నేను విరాగిని"

తను విస్మయంగా చూసింది అతనివైపు. నలిగి, మాసిన దుస్తులతో, పెరిగిన గడ్డంతో, సంస్కారంలేని క్రాపుతో కృశించిన దేహంతో ఉన్న అతన్ని చూడగానే మొదట తనకి కొద్దిగా ఆశ్చర్యంవేసింది.

"ఇంత చిన్న వయసులో...."

"కారణం ఉంది. అదంతా ప్రేమగాథ. మిమ్మల్ని విసిగించను. సూక్ష్మంగా చెబుతాను. ప్రేమించి, విఫలప్రేమతో భగ్నహృదయుడనై జీవితం ఎడారిలో ఒంటరిగా గడుపుతున్నాను. నాకు ఎవరూలేరు. పదివేల రూపాయల ఆస్తివుంది. అది అమ్మేసి ఆ డబ్బు మీకిచ్చేసి నేను యే హిమాలయాలకో వెళ్ళిపోతాను. నా జీవితంలో నా వల్ల ఎవరికీ సుఖం లభించలేదు. కనీసం ఒక కష్టజీవికైనా సహాయం చెయ్యగలిగాననే తృప్తి ఉంటే చాలు"

తను ఆ మాటల్ని వెంటనే నమ్మలేకపోయింది. యేంజరుగుతుందో ఊహించలేకుండా ఉంది.

"కాని...." యేదో అనబోయింది.

"దయచేసి మీరు నాకేమీ సలహా చెప్పవద్దు" అతను తీక్ష్ణంగా అన్నాడు. అతని ధోరణికి తను స్తబ్ధురాలైంది.

"నేననేది...."

"నాకు తెలుసు. నా కర్తవ్యం నాకు తెలుసు. మీరు ఒప్పుకోకపోతే ఇంకొకరికి ఇచ్చేసి పోతాను. నా లక్ష్యం ఏమిటో నేను నిర్ణయించు

కున్నాను. అది మారబోదు. నేనడిగే ప్రశ్నలకి సూటిగా సమాధానాలు చెబితే, మీ టైం అనవసరంగా వృధాకాదు" దృఢంగా అన్నాడతను. తనకి కొంచెం దెబ్బతగిలినమాట నిజం కాని, అంతా తనకోసమేకదా! అంతవరకూ ఆ వ్యక్తి ఎవరోకూడా తనకి తెలియదు. ఇవాళ ఉచితంగా పదివేల రూపాయిలు ఇస్తానంటున్నాడు. వింతకి మతిపోతోంది.

"మీరు మాట్లాడేది నేనర్థం చేసుకోలేకుండా ఉన్నాను"

ఏం మాట్లాడుతుందో తనకే తెలియదు.

"ఇందాక చెప్పాను. ఆస్తి స్థిరాస్తి రూపంలో ఉందని"

"ఊఁ"

"అది ఇంకా నా స్వాధీనంలోకి రాలేదు"

"అయితే...."

"అది ఇంకా నా స్వాధీనంలోకి రావటానికి ఒక షరతు ఉంది"

"ఏమిటి ?"

"నేను ఫలానా అమ్మాయిని ప్రేమించానని, అది ఫలించలేదని మా నాన్నకి తెలుసు. వివాహం చేసుకోమని ఆయన నన్ను చాలా బలవంత పెట్టారు. అది జరగనిపని. నా మూలంగా ఆయనకి చాలా కష్టం కల్గింది. ఎంతో బాధపడ్డాను. ఏం చెయ్యను ? నా మూలంగా మరోజీవి జీవితాంతం దుఃఖించటం నేను ఎలా సహించగలను ? చివరికి మా నాన్న ఆఖరి ప్రయత్నంగా తన స్వార్జితమైన స్థిరాస్తి ఇల్లు రాస్తూ; అది నేను వివాహం చేసుకునే పక్షంలోనే నాకు చెందుతుందని రాసి, దానికి ట్రస్టీలని ఏర్పరిచారు. అదీ పరిస్థితి."

అతని వృత్తాంతం వింటుంటే తనకి జాలివేసింది. ఆ పితృహృదయం ఎంతగా బాధపడ్డదో !

కొంచెం సేపటిదాకా ఎవరూ మాట్లాడలేదు. తరవాత అతనే అన్నాడు

"ఆ ఆస్తి నాకు సంక్రమించటానికి వివాహం అడ్డువచ్చింది"

"అయితే..."

"అవును. నాకు ఇష్టంలేకపోయింది. ఆస్తికోసం నేను బ్రతకటంలేదు. అయినప్పుడు అది ఎలాపోతే నాకేం ? కాని ఇప్పుడు చింతిస్తున్నాను. ఆస్తి ఉండీ, ఇతరులకు సహాయం చెయ్యలేకపోతున్నానని.

మరయితే తనకి పదివేలు ఇస్తానని ఎలా వాగ్దానం చేశాడు? తన కోసం అతను ఇప్పుడు పెళ్ళి చేసుకుంటాడా? అయితే ఆ మొగతి ఏంకాను?

"ఆ షరతు నెరవేరితేకాని అది నాకు లభ్యంకాదు. ముక్కుకు సూటిగా చెప్తున్నాను. మీరు ఒప్పుకుంటే మనం 'రిజిస్టర్ మేరేజి' చేసుకుందాం. ఆ స్త్రీ రాగానే మనం విడిపోదాం. తరవాత హిమాలయాలకి వెళ్ళిపోతాను" అతను తన కళ్ళలోకి మొదటిసారిగా చూశాడు. తనుకూడా అదే సమయంలో చూసింది. కొద్దిసేపటిక్రింద అతనిమీద తనకున్న సదభిప్రాయం అంతా మంచులా కరిగిపోతోంది. ఇదంతా ఒక నటన అన్నమాట. ఇంకా అతనెంతో ఉదారహృదయుడు అనుకుంది.

తనవైపు అతను ఇంకా అలాగే చూస్తున్నాడు. తను కళ్ళు దించింది. ఏం సమాధానం ఎలా చెప్పాలో తను ఊహించుకుంటోంది.

"ఇందులో మీరు అనుమానపడాల్సిందేమీ లేదనుకుంటాను. మీరు చదువుకున్నవారు. ఎంతో కష్టదశలో వున్నారు. 'సెంటిమెంట్స్'కి అంతగా కుస్తీ ప్రక్కన్లేవనుకుంటాను. ప్రయోజనం ముఖ్యం. మీలాంటి వాళ్ళకి ఎంతో జీవితముంది. అనుభవించాల్సిన ఆనందం ఇంకా మొదలుకాలేదు. ఈ డబ్బుతో మీ ఇష్టం వచ్చినంతవరకు చదువుకోవచ్చు. తరువాత జీవితంలో స్థిరపడవచ్చు"

ఏవేవో భావాలు తన మెదడులో దొర్లిపోతున్నాయి.

"నా మాటల్లోని నిజాయితీని మీరు అనుమానించాల్సిన అవసరంలేదు. డైవోర్స్ పిటీషన్ మీదకూడా ఇప్పుడే సంతకం పెట్టి మీకిచ్చేస్తాను. ఒక సాంకేతికమైన చిక్కు తొలగించుకోటానికే ఇలా చేస్తున్నామనే భావంతో మనం ప్రవర్తించలేమా?"

తను వింటోంది. తనకేమాత్రం ఇష్టంలేని సంభాషణ అయినా మట్టిబొమ్మలా మాట్లాడకుండా నుంచునివుంది. పరుషంగా వెళ్ళిపొమ్మని అనాలనుకుంది. కాని ఏదో తనని మాట్లాడకుండా అడ్డుపెడుతోంది.

"అసంభవమనుకుంటున్నారా?" వివాహం పవిత్రమైన బంధం అని నేను ఒప్పుకుంటున్నాను. దానిని కేవలం ఆర్థిక ప్రయోజనాలకోసం వినియోగించుకోటం నైతిక విలువల పతనమని మీరనుకుంటున్నారని నాకు తెలుసు. కాని ఆర్థికంగా విలువలేనివాళ్ళ జీవితాలు దుర్భరంగా చేసిన ఈ భౌతిక ప్రపంచంలో, తిండి, బట్ట, ఇల్లుకూడా కరువైన నామమాత్రంగా

ప్రతికి ఉన్నామని సంతృప్తి పడటంకంటె ఏ విధంగానో సమస్యాపరిష్కారానికి మనమీద మనం నమ్మకం కుదుర్చుకుని ప్రయత్నించటం మంచిదనుకుంటాను. ఏమంటారు ?"

అతని వాగ్ధోరణికి తను కొంచెం చలించింది. అతను ఆవేశంగా, నిష్కల్మషంగా కనిపించేలా మాట్లాడుతుంటే తను మూర్ఖంగా తిరస్కరించటం తన విజ్ఞానానికి తన విజ్ఞతకి ఏమంత ఘనం ? తటపటాయిస్తూ అంది. "కాని..."

"నేను నిష్కల్మషంగా చెబుతున్నాను. ఈ నామమాత్రం వివాహం అయినతరువాత మళ్లీ మిమ్మల్ని నేను కలుసుకోటం డబ్బు మీకివ్వటానికి వచ్చేరోజునే. ఆ పని అయిపోయినవాల నా దారిన నేను పోతాను. నన్ను నమ్మటానికి మీకేమీ అభ్యంతరం లేదనుకుంటాను"

అతని ప్రవర్తన కేవలం నటనే అయితే అంత ఆత్మవిశ్వాసం ఉట్టిపడేలా ఎలా మాట్లాడగలడు ? తనకి సహాయం చెయ్యటంకోసం అతను అంత కష్టపడటం చూసి తను మనస్ఫూర్తిగా అతన్ని నమ్మింది. కాని అతనే మళ్ళీ అన్నాడు.

"అయినా మిమ్మల్ని నిరాధారంగా నన్ను నమ్మమని అడుగను. రిజిస్ట్రార్ ఆఫీసులో విల్లు కాపీకి దరఖాస్తు పెడతాను. మీరే స్వయంగా అది చూసి నా ఋజు ప్రవర్తనని నమ్మగలరు. తరువాత నేను ఫలానా అనికూడా మన కరణంగారిచేత ఋజువుచేస్తాను. ఇంకా మీకు ఏదైనా అనుమానాలున్నాయా ?"

ఇహ తనేం మాట్లాడగలదు ?" అతనివైపు అలా గుడ్లప్పగించి చూడటంకంటె ఏమీ చెయ్యలేకపోయింది. తను మాట్లాడకపోవటంచూసి అన్నాడు అతను.

"మీరు 'సెంటిమెంటల్'గా ఫీలవుతున్నారనుకుంటాను. బాగా ఆలోచించండి. మీ ఇష్టం. కాని వ్యవహారం త్వరగా తెమిలిపోతే బావుంటుంది. నా దోవన నేను పోతాను. ఈ బాహ్య ఆకర్షణలూ, కృత్రిమవాతావరణం, నిరంతర సంసార జంజాటంలేని ప్రశాంతస్థలంలోకి"

అంతర్యుద్ధాన్ని అకస్మాత్తుగా ముగించి అంది తను "మిమ్మల్ని నమ్ముతున్నాను. మీ ఇష్టమొచ్చినట్టు చెయ్యండి"

అతను తన కళ్ళల్లోకి చూశాడు. ఎంతో జాలి ఆ కళ్ళల్లో ప్రతిఫలించినట్టుగా తను అనుకుంది. నీళ్ళుకూడా తిరిగాయని తన అనుమానం.

అన్నట్టుగా అతను అన్ని ఋజువులు చూపించాడు. ఏదో చూసింది. తనకేం తెలుసు? అయినా అతను మంచివాడనీ, మోసగాడు కాడనీ అతన్ని చూస్తేనే తెలుస్తుంది. లేకపోతే అంత వణుకూ బెరుకూ లేకుండా ఆత్మ విశ్వాసంతో; కేవలం వ్యవహారరీత్యా మాత్రమే మాట్లాడుతూ ఎలా ప్రవర్తించగలడు? ఇంటి యజమాని బాకీ తీర్చటానికి రెండువందలూ, మరో రెండువందలు ఖర్చుకీ ఇచ్చాడు. కేవలం యాంత్రికంగా స్వీకరించింది. చెయ్యకూడనిపని చేస్తున్నట్టుగా బాధపడ్డది. కాని ఆ నిస్సహాయ స్థితిలో దొరికిన ఆ కాస్త ఆధారం ఎలా వదులుకోటం?

పెళ్ళి అయింది. అన్నీ తెలిసివుండీ, ఫలితం ఎలా ఉండటానికి అవకాశం లేకపోలేదు. ఆలోచించికూడా ధైర్యంగా ముందుకి ఉరికింది. తనేం తప్పు చేసింది? లోకం తనని ఒంటరిగా, ఏమీ సంబంధం లేనట్టుగా వదిలి తనదారి తను చూసుకోమంటే ఏంచెయ్యగలదు? అయినా లోపల బాధపడుతూనే వుంది. ఆ రోజునుంచీ తనకి మానసికంగా శాంతి దూరమయింది. నెలా, రెండూ, మూడూ, నాలుగు నెలలు గడిచాయి. అప్పటిదాకా ఆశతో ఎదురు చూసింది. మరో నెల ఆశ, నిరాశల తెరమరుగులలో గడిపింది. ఆస్తి రావటానికీ ఇన్ని రోజులు కావాలా? ఒకవేళ కావాలిసివచ్చినా ఉత్తరమన్నా వ్రాయొచ్చు కదా! పెళ్ళి అయిన తర్వాత మళ్ళీ కనిపించకపోతే ఎంతో నిజాయితీ గలవాడని మెచ్చుకుంది. హైవోస్ప కటీస్ కూడా తన చేతుల్లో పెడితే ఆదర్శవంతుడనుకుంది. అది ఉపయోగించే పద్ధతి తనకి తెలీదు. అయినా ఫరవాలేదు. కనుక్కోవచ్చు. కాని ఇంతవరకూ వచ్చి ఇప్పుడు తొందర పడితే..."

"తరువాత ఒకసారి కనబడిపోవాలనే అనుకుంటున్నాను."

"నేనూ అదే అనుకున్నాను."

"ఏది?"

"మీరలా అనుకోక తప్పదని..."

"ఎందుకని?"

"అది స్పష్టంగానే తెలుస్తూ ఉంది."

"మీ రేమనుకుంటున్నా ఏం మాట్లాడుతున్నారో నాకు తెలియటంలేదు. పోనీండి. వచ్చినపని క్లుప్తంగా చెప్పి వెళతాను" అతను ఆగాడు.

ఎదురు చూస్తూనేవుంది, నిరాశగానే అయినా. తన అమాయకత్వానికి తనకే నవ్వొస్తోంది- అంత విచారంలోకూడా. బాహ్యాబిలువల్ని నమ్మమని ఎవరు చెప్పారు ? ఆ వరదరాజు ఎప్పుడో తన దగ్గరకి రాకతప్పదు. రాకపోతే మోసం చెయ్యటంలో అర్థంలేదు. ఒక దీర్ఘమైన ఘాటైన ఉపన్యాసం తయారు చేసుకుంది- మనసులోని కసి అంతా మాటల్లో ఇరికించి.

ఇన్నాళ్ళకి కనిపించాడు. రాధ అతనివైపు కోపఘూర్ణితంగా అలాగే చూస్తూ నిలబడింది. ఏం సాకు చెబుతాడో చూడాలి. ఇహ అతని మాయ మాటలకి లోబడటం వట్టిది. నిశ్చితమైన మనసుతో రాధ లోపలికిపోవటానికి వెనక్కి తిరిగింది. ఆ తిరగటంలో ఇంటి ముందరి పాదాలగుర్తులు మళ్ళీ కన పడ్డాయి. ఇంటిదాకా వచ్చి అతను తనతో మాట్లాడకుండానే ఎందుకు వెళ్ళి పోయినట్టు ? బహుశా ధైర్యం చాలలేదేమో ! ఇంతలో ఆమెకి తటాలున ఒక విషయం జ్ఞాపకం వచ్చింది. డబ్బు తీసుకువస్తేగాని అతను మళ్ళీ తనదగ్గ రికి రానన్నాడు. ఆ విషయం అకస్మాత్తుగా జ్ఞాపకంవచ్చి మాట నిలబెట్టు కోటానికి అలా వెళ్ళిపోయాడేమో ? ఇంతవరకూ ఆలస్యం కావటానికి బహుశా ఏదైనా చిక్కువచ్చి ఉండవచ్చు. ఆ విషయం చెప్పిపోవటానికి వచ్చి మళ్ళీ మనసు మార్చుకున్నాడా ?

రాధ నిట్టూర్పు విడిచింది. తను అతన్ని అనవసరంగా సమర్థిస్తోంది. తన ఈ తెలివితక్కువతనమే ఇంతవరకు తెచ్చింది. ఇంకా ఆ పిచ్చిఊహాలు తనని వదలటంలేదు. రాధకి తనమీద తనకే వెర్రికోపం వచ్చింది. ఆ కోపంలో తనకీ శాస్తి కావలసిందేనని అనుకుంది. మళ్లీ తన నిస్సహాయత జ్ఞాపకంవచ్చి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

శూన్యహృదయంతో, కన్నీటిలో బరువెక్కిన రెప్పలతో అలా ఎంత సేపు గతాన్ని స్మరిస్తూ, భావిని ఆలోచించి భయపడుతూ, గోడకి జేరగిల బడిఉందో ఆమెకి తెలియదు. చిన్న దగ్గు వినిపించింది. ఉలిక్కిపడి చూసింది అప్పుడప్పుడే ఆవరించిన చీకటిలో నీడలా ఎవరో మనిషిని చూసి భయంతో లేచి నిలబడింది.

"ఎవరు ?" వెంటనే జవాబు రాలేదు. మళ్లీ ప్రశ్నించింది,

"నేను వరదరాజుని"

రాధ ముఖం ఒక్కసారిగా ఎర్రబడటం ఆ చీకటిలో అతను గమనించ లేదు. మృదువుగా అన్నాడు. "రాధా !" ఈ పిలుపుతో మిగిలినకాస్త సహ

సంకూడా ఆమెకి అంతరించింది. కటువుగా "ఏంకావాలి ?" అంది. అతను విస్తుపోయాడు. మళ్లీ తేరుకుని, కొంచెం తటపటాయించి అన్నాడు. "దీపం లేదా ?" అతనామాటలు అనటం నిప్పుపెట్టెకోసం తడుముకుంటున్న రాధ, నిప్పుపుల్ల వెలిగించటం ఒకేసారి జరిగాయి. దీపం వెలుగులో వరదరాజు ముఖంవైపు తీక్ష్ణంగా చూసిందామె. అతను చాలా దీనంగా ఉన్నాడు. కాని ఈ సారి ఆమె మోసపోదల్చుకోలేదు. అతను ఎలా మొదలుపెట్టాలో తెలియక తడుముకుని అన్నాడు.

"మొదట రాకూడదనే అనుకున్నాను—"

"నాకు తెలుసు"

అతనామెవైపు ఆశ్చర్యంగా చూశాడు.

"ఎలా ?"

"నాకూ కళ్ళున్నాయి"

తను రావటం ఆమె చూసిందన్నమాట. అయినా పిలవలేదు.

"మీరు చెప్పబోయేది యేదో నాకు తెలుసు. ఎందుకు పాపం, మీ కనవసర శ్రమ."

"యేం చెప్పబోతున్నాను ?"

"ఆ స్త్రీవ్యవహారంలో యేదో అనుకోని చిక్కు వచ్చిందని..."

"మీకెలా తెలుసు ?"

"నేను బహుశా మీ రనుకున్నంత తెలివితక్కువదాన్ని కానేమో."

"మీరు తెలివితక్కువవారని ఎవరన్నారు ?"

"చర్యలవల్ల తెలుపుతూవుంటే, ఇంకా అనట మెందుకు ?"

"మీకు కోపం రావటంలో అర్థంలేకపోలేదు. కాని నేను చెప్పేది..."

అతను ఇంకా తన తప్పును ఒప్పుకోకపోవటం చూసి రాధకి వొళ్ళు మండింది. కన్నీటితో ఎర్రనైన కళ్లు, కోపంతో మరింత ఎర్రబడ్డాయి. తీక్ష్ణంగా అతనివైపు చూస్తూ అన్నది.

"ఏమిటి మీరు చెప్పేది ?"

ఆ ఉద్ధృతం చూసి వరదరాజు చకితుడై ఆమెవైపు చూశాడు. కోపంలో ఆమె పెదవులు వొణుకుతున్నాయి. సహజంగా సువర్ణచ్ఛాయలో వుండే ఆమె ముఖవర్చస్సు రాగరంజితమై మరింత మనోహరంగా ఉంది. వరదరాజు కొంచెంసేపటివరకూ అలాగే దృష్టి నిలిపాడు. ఒక క్షణం ఆమె

కోపంగా వుందనే సంగతి మర్చిపోయాడు. ఆ క్షణంసేపూ తను అక్కడికి ఎందుకు వచ్చాడో అతనికి జ్ఞాపకం రాలేదు. అతను తనవైపు అలా పరకాయించి చూడటం చూసి రాధ ముఖం ప్రక్కకి తిప్పుకుంది. ఆమె అనదలుచుకున్న మాటలన్నీ అనలేకపోతోంది. తను అనవసరంగా తొందరపడుతున్న దేమోననే అనుమానం ఆమెకి యింకా పోలేదు. యేమైనా, అతను చెప్పదలుచుకున్న దేదో పూర్తిగా విని తను అనాలిసిన మాటలు అనటం మంచిదని తమాయించుకుంది.

రాధ ముఖం పక్కకితిప్పుకోటంతో వరదరాజుకి తనపరిస్థితి అర్థమైంది. తను యేం చెప్పినా ఆమె నమ్మేస్థితిలో లేదు. మనుషులు మనుషుల్ని ఇంత అపనమ్మకంతో ఎందుకు చూడాలి? తను యేం చెయ్యబోయాడు, యేం చెయ్యదల్చుకున్నాడు? యేం చేస్తున్నాడు? తనని ఆమె ఎందుకు నమ్మదు. మనుషులంతా ఇంతేనా? అతనికి రాధమీద ఉన్నట్టుండి అమితకోపం వొచ్చింది. తను ఆమెకి బుద్ధిపూర్వకంగా ఏమీ అపకారం తలపెట్టలేదు. ఇక ముందుకూడా ఏమీ చెయ్యదలచుకోలేదు కూడా. అయినప్పుడు ఆమె అనవసరంగా నీడనుచూసి బెదరటం ఎందుకు? తనని తను నమ్మలేక ఆ అపవాదు పక్కవాడిమీద వేసే ఈ దౌర్బల్యం జయించలేక జీవితం దుఃఖభాజనం చేసుకునే ఇలాంటివారిమీద తను ఎందుకు కనికరం వహించాలి?

వరదరాజు మెదడులో ఏహ్యభావం క్రమంగా వ్యాపించింది. పరుల కష్టాల్ని ఆదుకోబోయాడు. అందుకే శిక్షింపబడుతున్నాడు! ప్రపంచం ఇంత స్వార్థపూరితంగా ఎందుకు తయారవుతుందో తనకి పూర్తిగా తెలిసిపోయిందనుకున్నాడు. స్వార్థంకోసం పాటుపడకపోవటంవల్లే గదా తను ఈ నిందని మీదవేసుకోవలసి రావటం. వచ్చిన నింద రానేవచ్చింది. ఇహ తను ఆమెకెందుకు భయపడాలి? ఆమె ఏమనుకుంటుందో అని ఎందుకు మథనపడాలి?

వరదరాజు మనసు భయానకంగా వక్రించింది. తను ఆమె భర్త. అతనిలో యేవో శక్తులు విజృంభించాయి. "రాధా!"

రాధ ఆ స్వరం విని బెదిరి అతనివైపు చూసింది. తన స్వరంవిని వరదరాజే దిగ్భ్రాంతుడైనాడు.

ఆ పిలుపులోని కోపం, కాఠిన్యం, అధికారం అన్నిటినీమించి దౌర్జన్యం అతని మనసుని చికాకు పరిచాయి. అవన్నీ కాక ఆ పిలుపులో మరేదో భావం అవ్యక్తంగా, అస్పష్టంగా ఇమిడివున్న ఇంకేదో భావం వరదరాజు మానస

వీధిలో గోచరించింది. తనలో ఇన్ని దుర్గుణాలు అణగారి ఉన్నాయని అత నెప్పుడూ అనుకోలేదు. ఎలా సాహసించగలిగాడు తను ? అతని మనసు కుంగి పోయింది. పశ్చాత్తాపంతో ఆమెవైపు చూశాడు. రాధ ఏమీ అర్థంకాక యేమనాలో తోచక శూన్యంగా చూడసాగింది. అతనిలో ఒక్కసారిగా జాలి కలిగింది. తన పరిస్థితి సరిగాలేదు. ఇహ ఇక్కడ ఉండకూడదు. అతను లేచి నుంచున్నాడు.

"క్షమించండి" అనిమాత్రం అనేసి బరువుగా అడుగులు వేసుకుంటూ గుమ్మం దాటాడు. అతను పోవటం ఊరికే చూస్తూ వుండటంకంటె రాధ యేమీ అనలేకపోయింది. తను యేదో తప్పుచేసినట్టుగానే ఆమె భావించు కుంది. ఆమెకి యేమీ తోచలేదు. తనకి యేమీ చేతకాదనీ, ఆలోచించి మన సుని పాడుచేసుకోటం, అవకాశాలని పాడుచేసుకోటంకంటె ఇంకేమీ చెయ్య లేదనీ ఒక నమ్మకం ఆమెలో పాతుకుపోతోంది. తను అలా మాట్లాడటానికి తగిన కారణం ఉందని ఆమెకి తెలియకపోలేదు. అయినాకూడా తనమీదే తప్పంతా త్రోసివేయబడటం ఎందుకో ? అతను తన నా మాత్రం ఎందుకు అర్థం చేసుకోలేడో ఆమెకి తెలియదు. పరుషంగా మాట్లాడవలసింది తను. కాని చివరికి అతనే తనని అధికారయుక్తంగా ఆజ్ఞాపిస్తున్నట్టుగా మాట్లాడ గలిగాడు. రాధ నుదురు గట్టిగా పట్టుకుని కూలబడ్డది.

వరదరాజు నడుస్తున్నాడేకాని ఎటు పోతున్నదీ అతనికి తెలియదు. తను ఆమెని అలా పిలవటం ఎలా సంభవించింది ? రాధ తీవ్రోక్తులు తనని కోపింపచేశాయా ? ఆమె అలా మాట్లాడటంలో తప్పేముంది ? తన వాగ్దా నం ప్రకారం తను నడవలేకపోయినప్పుడు ఆమె తన ప్రవర్తనని అనుమానించ టంలో తప్పేముంది ? అయినప్పుడు ఆమె ఆ స్థితిలోవున్న ఏ స్త్రీ అయినా తనని అలా ఎదుర్కోటంలో అసహజంకాని, అన్యాయంకాని ఏముంది ? అసలు ఆమె అలా అనటానికి అవకాశం ఉండనే తనుకూడా అనుకొన్నాడు కదా ! అందుకేకదా తను ఆమెతో చెప్పకుండా ఇన్నాళ్ళువుంది. తన ప్రయ త్నాలుకూడా ఆ ఉద్దేశంలోనేకదా చేసింది. అయినప్పుడు తను హఠాత్తుగా కోపించటంలో అర్థంలేదు. ఇందులో ఇంకేదో రహస్యంవుంది. ఆమె మాట ల్లోని తీవ్రతకాకుండా, వాటిలో ప్రస్ఫుటంగా కనిపించే స్వార్థం తనకి కోపం తెప్పించింది. తను స్వార్థరాహిత్యంతో ఒకపని చేస్తున్నప్పుడు తనకి స్వార్థం అంటకట్టటంలోగల స్వార్థం చూసి తనకి వళ్లుమండింది. కాని ఇందులోకూడా

మళ్లీ ఇందాకటిచిక్కే వస్తోంది. ఆమె అంత పరుషంగా మాట్లాడటానికి కారణం ఉందని తను ఒప్పుకున్నాడు. మరే స్త్రీ అయినా అలాగే ప్రవర్తించి ఉంటుందనికూడా ఒప్పుకుంటున్నాడు. అయినప్పుడు ఇందులో స్వార్థం ప్రశక్తిరాదు. ఆమె తనమీద నిందవెయ్యటానికి ప్రయత్నించిందా? ఆమె భావం ఇదేనని వేరే చెప్పటమెందుకు? అసలలా మాట్లాడటానికి మూలకారణం ఆదేకదా?

అయితే తనకి కోపం తెప్పించింది. వీటిలో ఏదీకాదు. వరదరాజు గుండె వేగంగా కొట్టుకుంది. దేవుడా! ఆమె మాటల్ని తరిచి తరిచి ఆలోచిస్తే ఏం లాభం? తప్పు తనమీద ఉంది. అవును. నగ్నంగా కనిపిస్తున్న నిజం తను ఇందాకటినుంచీ చూడదల్చుకోలేదు. తను అనుకున్నంత పవిత్రుడు కాడు వరదరాజు. అది దాచి లాభంలేదు. తను కేవలం మానవ మాత్రుడు. మానవసహజమైన దౌర్బల్యాలూ, లోపాలూ తనకి లేకుండా ఎలా పోతాయి? తన హృదయం చితికిపోయిందనీ, తన మనసు లౌకిక సుఖాల్ని ఆశించదనీ, తను బ్రతికే మృతుడైనట్టేనని భావించుకుంటున్నాడు. అది ఘోరమైన అసత్యం. రాధని చూసినప్పటినుంచీ కూడా బహుశా, తన మనసు రహస్యంగా, తనకి తెలియనియ్యకుండా (!) ఆమెవైపు మళ్లింది. అందుకే ఎలాగైనా తను ఆమెని వశంచేసుకోవాలని అంతరాంతరాలలో కోరుకున్నాడు. అందుకే ఆమె మాటల్లో తప్పుపట్టటానికి ప్రయత్నించాడు. తప్పంతా ఆమెమీదనే తోసేయగూడలనుకున్నాడు. తనని నిందించినంత స్వార్థం కల స్త్రీపట్ల స్వార్థత్యాగం అవసరమని సరిపెట్టుకోటానికి చూశాడు. ఎలాగైనా దొరికిన అవకాశం వినియోగించుకోవాలని తనలో ఏవో శక్తులు సర్వవిధాలా ప్రయత్నించాయి. ఇంకా నయం, త్వరగా మేల్కొన్నాడు. ఒక్క నిమిషం ఆలస్యం అయివుంటే ఆమె జీవితం ఏమయిఉండేదో! ఏమయినా, తనకి ఇప్పుడు గర్వంగావుంది మానవసహజమైన దౌర్బల్యాలని మానవసహజమైన విజ్ఞానంతో ఓడించాడు.

ఎన్నో రోజులతర్వాత ఆ రాత్రి వరదరాజు ప్రశాంతంగా నిద్రించాడు. నిద్రలో అతనికి చిత్రమైన కలవచ్చింది. పొగమంచు దట్టంగా వ్యాపించింది చుట్టుప్రక్కల ఏ వస్తువూ కనిపించటంలేదు. అంతా అయోమయంగా ఉంది. తను తప్ప ఇహ ఎవరూ తన సామీప్యంలో సంచరించటంలేదు. తను ఎటు పోతున్నదీ తెలియదు. తనదారికి ఎక్కడా ఏదీ అడ్డం రావటంలేదు. కాళ్ళ

క్రింద మృదువైన లతలెన్నో నలిగిపోతున్నట్టుగా వుంది. తటాలున ఏదో గోతిలో జారిపడ్డాడు. అలా ఎంతసేపున్నాడో తెలియదు. క్రమంగా చుట్టు ప్రక్కల వస్తువులు గోచరమవుతున్నాయి. వెలుగు క్రమంగా వస్తోంది. తను ఒక్కడే కాదు-ఆ ప్రాంతంలో. ఇంకా ఎంతోమంది జనం హడావిడిగా తిరుగుతున్నారు. గట్టిగా కేకవేశాడు. ఎవరూ వినిపించుకోలేదు. మళ్లీ కేక వేశాడు.

కళ్లు నులుముకుని చుట్టూ చూశాడు వరదరాజు. చీకటిగా ఉంది. గోతిలో కాదు, పక్కమీద ఉన్నాడు.

ఈ సంఘటన తర్వాత వరదరాజుకి ఆత్మపరీక్ష ఎక్కువైంది. రాధని గురించి ఎక్కువగా ఆలోచించటం మానుకోదల్చుకున్నాడు. కానీ పరాకుగావున్న సమయంలో మనసులో రాధ ప్రతిబింబం ప్రత్యక్షమవుతోంది. ఆమెని మళ్లీ చూడాలనే వాంఛ ఎక్కువౌతోంది. నిశితంగా ఆలోచించి తను తీర్మానించాడు. తను రాధని ప్రేమిస్తున్నాడు. సందేహంలేదు. కాని ప్రేమ అంటే ? మళ్లీ అదనికి డోలాయమానంగావుంది. రాధ అంటె తనలో ఏదో అనిర్వచనీయమైన అభిమానం, ఏదో సన్నిహితమైన బాంధవ్యం తరాల నుంచి వస్తున్నట్టుగా అనుభూతి, కలుగుతున్నాయి. 'ప్రేమ' అంటే ఇంత కంటె మరేదీకాదని అతనికి తోచింది. కాని రాధ దగ్గిరకి తను ఎలా వెళ్ళ గలడు? తనని చూడగానే ఆమె తారాజువ్వలా అయిపోతుంది. ఆమెకిచ్చిన వాగ్దానం ప్రకారం ఎలాగైనా పదివేలు సంపాదించి ఆమె చేతిలో పెట్టాలి. తన మాటలమీద విశ్వాసం వమ్ముకాలేదని ఆమె గ్రహించాలి. కాని పదివేలు ఎలా సంపాదించాలి ?

వరదరాజు చేతిలోవున్న కాస్త సొమ్మూ గుర్రపు పందాలలో, ఖర్చు పెట్టి అదృష్టం పరీక్షించుకోవాలనుకున్నాడు. పరీక్షించుకుని తన దురదృష్టం నిరూపించుకున్నాడు. ఇహ తను చేయగలిగిందేమీలేదు. రాధతో ముఖాముఖిమాట్లాడి పరిస్థితి ఆమెకి విశదపరచటంకంటె అనుసరణీయమైన పద్ధతి ఏమీ తోచలేదు అతనికి.

వరదరాజు వెళ్ళేసరికి రాధ అలవాటు ప్రకారం గత జలసేతుబంధనంలో నిమగ్న అయి ఉంది. అతన్ని చూడగానే జుగుప్సాభావంతో ముఖం చిట్లించుకుంది. అది గమనించగానే అతను చిన్నబుచ్చుకున్నాడు.

“ఏం కావాలి ?” కటువుగా అడిగింది రాధ.

ఇంకేదో కావలిసివస్తే తను ఆమెదగ్గిరికెందుకు రావటం.

"దురదృష్టవశాత్తూ నా వాగ్దానం అనుకున్న ప్రకారం నెరవేర్చుకో లేకపోయాను."

"ఇహ ఆ విషయం ఎత్తకండి"

"నా మీద ముందే మీరు దురభిప్రాయం కలిగించుకుంటే ఏంలాభం? పరిస్థితుల్ని తెలుసుకుని మంచిచెడ్డలు పరిశీలించటం విజ్ఞుల లక్షణం. సౌహార్దంతో విమర్శనకి పూనుకోటం బుద్ధిమంతుల లక్షణం.

"ఇప్పుడు మీరు లక్షణగ్రంథాలు తిరగెయ్యక్కర్లేదు."

"మీరు విన్నా వినకపోయినా రెండుముక్కలు చెప్పి పోదల్చుకున్నాను"

"చేసిన అపకారం చాలక ఇంకా నన్నెందుకు బాధిస్తారు ?"

వరదరాజుకి కోపం రావటంలేదు. కాని విసుగుదలతో బుర్ర గోక్కున్నాడు.

రాధ ఉద్రేకం ఆపుకోలేకపోతోంది. వరదరాజు అనుకున్నదంతా చెప్పటానికి సందేహిస్తున్నాడు. కాని ఏదో తేల్చివెయ్యటం మంచిదని తోచిందతనికి అన్నాడు.

"మీరు నన్నిలా అనుమానించటంలో అర్థముంది. అందుకు నేను కోపగించుకోను. ఆ స్థితి విషయంలో అనివార్యమైన చిక్కు రాకపోతే నా మంచితనం నిరూపితమై ఉండేది. అసలీ ఆ స్థితికి..."

"ఈ కుంటిసాకులు నేను వినను" దృఢంగా అంది రాధ.

అతను ఆమెవైపు ఒకసారి చూసి "ఓ పోనీ ఆ విషయం చెప్పను లెండి" అన్నాడు.

"ఏ విషయమూ మీరు చెప్పనవసరంలేదు. నన్నిలా బ్రతకనియ్యండి?

"మీకింత కష్టం కలిగిస్తున్నానని నాకు తెలియదు. మీరు నన్నెంత తృణీకారభావంతో చూస్తున్నారో, నేను మిమ్మల్ని అంతకంటె ఎన్నోరెట్లు ఎక్కువగా..." అతను వాక్యం పూర్తిచేసేముందు ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ భావోద్రేకంతో నెమ్మదిగా, దృఢంగా నిజాన్ని బయటపెడుతున్నట్టుగా అన్నాడు. "ప్రేమభావంతో చూస్తున్నాను"

ఈ మాటలతో రాధ సహనానికి ఆఖరిపట్టుకూడా విడిపోయింది. ఇన్నాళ్ళనుంచీ తను అనుమానించినా గట్టి ఆధారం లేకుండా నిందించటం

తొందరపాటును వ్యక్తం చెయ్యటమేననే ధోరణిలో మాట్లాడుతూ వచ్చింది. ఇప్పుడు మనిషి అసలు రంగులలో బయటపడ్డాడు. ఆమెలో అవమానం, అసహనం, అభిమానం, క్రోధం, జుగుప్స అన్నీ మూర్తీభవించాయి. తనని తానే మర్చిపోయి మండే కళ్ళతో నిప్పులవర్షం కురిపించింది. పెదవులు వ్యంగ్యంగా వరదరాజుని చూసి పకాలున నవ్వాయి.

"నిస్వార్థ ఋషిపుంగవులుకి హిమాలయాలమీది భ్రమ తొలగిపోయినట్టుంది"

వరదరాజు ఏమీ మాట్లాడలేదు. ఆమె నవ్వు అతని గుండెల్లో గుచ్చుకుంది. రాధ తటాలున నవ్వు ఆపేసి గంభీరంగా, తీక్ష్ణంగా శక్తులన్నీ కూడదీసుకుని దులిపెయ్యసాగింది.

"మనిషిలో స్వార్థంకంటె మాటలలో తేనె ఎక్కువ ఉంటుందని నాకు తెలీదు, మీతో పరిచయం అయ్యేదాకా. మా ఇంటి యజమానిని స్వార్థపరుడని తిట్టాను. కాని అతను చెయ్యదలచుకున్నదేదో స్పష్టంగా చెప్పి చెయ్యటానికి సిద్ధపడ్డాడు. ఆర్థికంగా నా హీనస్థితిని తన స్వార్థానికి ఉపయోగించుకోవాలనుకున్నాడు. అది ఎంత హేయమైనా, దాంట్లో తెరమరుగు వ్యవహారం లేదు. నమ్మకద్రోహం లేదు. తేనెమాటల వెనకాల విషగుళికలు లేవు, దొంగసాకులు లేవు, నాటకంలేదు, వేషాలులేవు, పిరికితనం లేదు. రాత్రి కన్నంవేసే దొంగకంటె బందిపోటు దొంగ నయం. చేసేది బహిరంగంగా చెయ్యటం ఉత్తమం. వలలుపన్ని ఉచ్చులు బిగించే కిరాతకుడికంటే, తుపాకితో కాల్చి చంపే వేటగాడు నయం.

"ఒక నిస్సహాయ స్త్రీని లోబరచుకోటంకోసం ఇంతప్లాను కావాలా? ఇంత తెలివితేటలు కావాలా? ఇన్నిరోజులు కాచుకుకూచోవాలా? ఇంత కొంగజపం చెయ్యాలా? ఇంత కష్టపడి దొంగవేషం వేసుకోవాలా? ఇంత కుతంత్రం పన్నాలా?

నాలో ఏంచూసి ఇన్నిబాధలు పడ్డారు? పాపం, ప్రేమించారా? ప్రేమించి వివాహం చేసుకోటం సాధ్యంకాకపోయేసరికి, వివాహం ఏవిధంగానైనా ముందే చేసుకుని తరువాత తీర్గా ప్రేమిద్దామనుకుని ఇలా చేశారా? ఎంత శ్రమ! శ్రమపడ్డ తరువాత ఫలితం దక్కకపోతే ఆత్మహత్య చేసుకోడానికి సిద్ధపడతారేమో! నాకెందుకు ఆ పాప. మీ ఇష్టం వచ్చినట్టు

చేసుకోండి. ఎలాగైతే ఏం మీ తంత్రం పారింది. చట్టంరీత్యా నేను ఏమీ చెయ్యలేను. అది మీకూ నాకూకూడా తెలుసు.

మనిషి ఎవరినైనా నమ్మవచ్చుకాని మనిషిని మాత్రం నమ్మకూడదనే వాక్యం నిజం చేశారు. నమ్మకద్రోహం మరేమంత కష్టంకాదనికూడా కష్టపడి ఋజువు చేశారు.

వరదరాజు తలవంచుకు కూచున్నాడు. రాధ అనే ప్రతిమాటా అతని గుండెల్లో గుచ్చుకుంటోంది. అయినా ఏమీ అనలేదు. అతని మౌనం ఆమెకి మరింత దుస్సహంగావుంది. ఎంత ఘాటుగా సూదిపోటు మాటలన్నా ఆమెకి కసితీరటంలేదు. పదాలు దొరకటంలేదు. ఆవేదన, ఆవేశం ఉపశమించలేదు. పదాల ప్రభావంవల్ల అవి బయటపడే మార్గంలేక కన్నీరుగా మారి ఏకధారగా ప్రవహించసాగాయి.

"నేను మీకేం అపకారం చేశాను? అసలే కష్టాలతో పోరు భరించలేకుండావున్నా నామీదే మీ సామర్థ్యం ఉపయోగించాలా? ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాననేకదా మీరిలా ధైర్యం చెయ్యగలిగారు. మీరు చెయ్యదల్చుకున్న ఆ మిగతా కార్యక్రమంకూడా చేసెయ్యండి. ఏమయినా భరించటానికి సిద్ధంగా ఉన్నాను. ఎందుకలా చూస్తారు? మీరు చేతకానివారు కాదు. "ఏమిటీ వాగుడు?" అని గద్దించండి. బెదిరించండి. మీ అధికారం చలాయించుకోండి. మీరేంచేసినా చెల్లుతుంది కదా. అడ్డు పెట్టేదెవరు? అడిగేదెవరు? ఒక్క ఆడది మిమ్మల్నేమి చెయ్యగలదు?"

వరదరాజు ముఖాన నెత్తురుచుక్కలేదు. అవమానంతో అతను కుంగిపోయాడు. రాధమీద అతనికి కోపం రావటానికి ఆస్కారంలేదు ఆమె ఏమన్నా అందులో ఆశ్చర్యపడాలిసింది లేదని ఇదివరకే తను తెలుసుకున్నాడు తనమీద తనకే కోపంవచ్చింది. తను ఎంత సిగ్గులేకుండా ప్రవర్తించగలిగాడు. తను ఇన్నాళ్లనుంచీ బ్రతికివుంది ఇలా ఘోరంగా అవమానించబడటానికేనా?

"మీ పాదాలకి శతసహస్ర నమస్కారాలు. దయచేసి ఇహనించైనా నన్నిలా బ్రతకనివ్వండి. నా జీవితం ఎలాగూ ధ్వంసం అయింది. ఆ బ్రతకాలిసిన నాలుగురోజులూ అయినా కొంచెం శాంతి ఉండనివ్వండి నాకు."

వరదరాజు ఆమె ముఖంవంక తేరిపారచూశాడు. ఆమె చీరచెరగు నోటికి అడ్డం పెట్టుకుని పొంగిపొర్లే దుఃఖం ఆపుకుంటోంది. ఆ దృశ్యం చూసి అతని మనసు వికలమైనది. ఆమె దగ్గరగావెళ్ళి అనునయించాలనే గాఢ

వాంఛ కలిగిందతనికి. లేచి నుంచున్నాను. రెండడుగులు ఆమెవైపు వేశాడు. ఆమె బెదురుచూపులు చూసి తటాలున లోపలిగదిలోకి వెళ్ళి తలుపు దడాలున వేసుకుంది.

ఒకక్షణం వరదరాజు తను ఏ లోకంలో ఉన్నాడో మర్చిపోయాడు. ఆ క్షణంలో తను మరణిస్తే బావుండుననుకున్నాడు. కొంచెంసేపు అలాగే నిలబడి, మూసినతలుపువైపు శూన్యంగాచూసి వెనక్కితిరిగి ఇల్లుదాటి రోడ్డు మీదికి నడిచాడు. రాధ అన్నమాటలు అన్నీ అతనికి జ్ఞాపకం రాసాగాయి. తను కిరాతకుడుగా, దొంగగా, వేషధారిగా హృదయంలేని రాతిబొమ్మగా చిత్రించబడ్డాడు; అవును. కారణం ఏమైతేనేం. తను ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయాడు. దానివల్ల కలగబోయే దుష్ఫలితం తనకి తెలియనిదికాదు. ఇచ్చినమాట ఏ పరిస్థితిలో అయినా నిలబెట్టుకోగల శక్తిలేని తను అసలు ఎందుకు రంగంలోకి దూకాలి. మానంకంటె ప్రాణం ఎక్కువగా చూసుకున్నాడు. ఫలితం అనుభవించాడు.

వరదరాజు తను ఈ ప్రపంచంలో ఇంకా బ్రతికిఉండాల్సిన ఆవశ్యకత ఏమిటో బోధపడలేదు. జీవితం ఎడారివంటిదని తెలుసుకుని, దూరాన ఏదో కనబడితే పచ్చికబయలు అని భ్రమించాడు. మోసపోయాడు. అపహాసించబడ్డాడు. తను వట్టి అబద్ధాలకోరుట! అన్యాయంగా ఒకస్త్రీని వంచించటానికి పూనుకొన్న నమ్మకద్రోహిట? అతని శరీరం జ్వలించిపోతోంది. ఈ అబద్ధం ఇహ ఎంతోకాలం ప్రచారం కావటానికి వీల్లేదు. నిజం నిప్పులా బయటపడాలి.

అతను సరాసరి ఇంటికి వెళ్ళి కాగితం, కలం తీసుకున్నాడు. రాధ రూపం అతని కళ్ళముందు సాక్షాత్కరించింది. విషాదంగా నవ్వాడు.

"ప్రియమైన రాధా"

ఈ ఉత్తరం పూర్తిగా చదువుతారని ఆశిస్తున్నాను. నా దురదృష్టం వల్ల మీరు నన్ను పూర్తిగా అపార్థంచేసుకున్నారు. జరిగినసంగతి ఇది. నా వాగ్దానం నెరవేర్చుకోటానికి, ఇంటిని అమ్మే ప్రయత్నంలో నేనేమీ లోపం చెయ్యలేదు. ఆ ప్రయత్నాలు జరుగుతూవుండగా నా దౌర్భాగ్యంవల్ల ఆ ఆస్తిని అమ్మటానికి పేచీవచ్చింది. ఆ ఆస్తిని మా నాన్నగారు స్వార్జితధనంతో కొన్నారు. దానికి మైనరు తగాదా ఉన్నదట. అది నాకు తెలియదు. తీరా నేను దాని అమ్మక ప్రయత్నంలో ఉండగా కోర్టులో దావా పడ్డది. అది తేలే

దాకా ఆస్తిని అమ్మటానికి నాకు అధికారంలేదని ట్రస్టీలు చెప్పారు. ఈ విషయం మీకు తెలియచెయ్యాలని చాలా ప్రయత్నించాను. ఉత్తరం రాద్దామనుకున్నాను. కాని స్వయంగా చెప్పటం మంచిదని ఆ ప్రయత్నం విరమించుకున్నాను. ఎప్పుడు మీ దగ్గిరికి వద్దామని బయలుదేరినా ధైర్యం చాలేదికాదు. మీకీ విషయం నమ్మరేమోనని అనుకున్నాను. చాలా సున్నితవిషయంకదా! ఏంచేయాలో తోచలేదు. చాలా రోజులవరకు. తరువాత ఒక ఆలోచన తట్టింది. కోర్టువారు జారీచేసిన ఉత్తరువులు మొదలైన కాగితాలు మీకు చూపిస్తే నా నిర్దోషిత్వం రుజువు అవుతుందని ఆశించాను. కాని మళ్లీ ఇదంతా నా కుతంత్రం అనీ మీ రనుమానించటానికి అవకాశం ఉందని ఆ ప్రయత్నంకూడా విరమించుకున్నాను. తరవాత నా ఊహ బలపడ్డదనుకోండి.

ఇహ ఏదిదారి? ఒకే ఒక్క ఉపాయం తోచింది. నేను బ్రతికిచెయ్యాల్సిన ఘనకార్యాలేమిటో నా కర్థంకాలేదు. జీవితంలో మొదటిసారి 'దెబ్బ తిన్నానని మీకు చెప్పానని జ్ఞాపకం. జీవచ్ఛవంగా బ్రతకటంకంటె శాశ్వతంగా కన్నుమూయటం శ్రేయస్కరమనిపించింది. ఇందువల్ల శాంతిలేదని నా మనసుకి చిరశాంతి లభించటమే కాకుండా. మరో ప్రాణి—జీవితంలో ఎన్నో అనుభవాలు చవిచూడాల్సి ఒక పేదజీవి-సుఖపడగలదు. ఎలా అంటారా? నాకు లైఫ్ ఇన్సూరెన్సు పాలిసీ ఉంది—పదివేలకి. తతంగం పూర్తిచేశాను.

అంతర్వాహినిలా, మనిషి అంతరంలో కోరికలెప్పుడూ జీవనదిలా ప్రవహిస్తూంటాయి కాబోలు. చావటం సులభమనుకున్నాను. కాదని తేలింది. ఎన్నోసార్లు ప్రయత్నించాను. స్థైర్యంకోసం మీరు పత్రికలో రాసిన 'స్వీయచరిత్ర' జేబులో పెట్టుకుని సముద్రతీరానికి వెళ్లేవాణ్ణి. లాభం లేకపోయింది. ఏదో కోరిక మనసులో మెదిలేది. తర్వాత గ్రహించాను. నా దౌర్బల్యానికి కారణం మరేమిటోకాదు. మీరు నమ్మకపోవచ్చు. కాని ఇప్పుడు ఈ క్షణంలో అబద్ధం చెప్పటానికి నాకు బలమైన కారణం ఏమీ లేదనుకుంటాను.

నా జీవితంలో రెండోసారి ప్రేమించాను. ఫలితం కోసం అర్రులు చాచటం మానవసహజం. నేను సరిహద్దులు దాటి ఎప్పుడూ వెళ్ళలేదు. చివరిదాకా అలాగే ప్రవర్తించగలిగినందుకు నాకు నిజంగా గర్వంగానేవుంది. మనసులో బలీయమైన సంఘర్షణ జరిగింది. ప్రాపంచిక శక్తులకీ, నైతికశక్తులకీ.

మానసికబాధ ఇలా ఉండగా మీ దగ్గిరకి చివరిసారి రావటం జరిగింది. నా పొరపాటు గ్రహించుకున్నాను. చాలా బుద్ధిహీనుడిలా ప్రవర్తిం

చాను. లోకంపోకడ తెలిసీ తెలియనట్లు అవసరానికి నటించుతున్నాను. మాట నిలబెట్టుకోటంకంటె-ముఖ్యంగా ఇలాంటి సున్నితమైన విషయాల్లో-ప్రధానమైనది ఏదీ లేదని తెలిసింది.

బహుశా రేపు ప్రొద్దునకి నేను మీరనుకున్నంత కనీసం అన్నంత దుర్మార్గుడిని కానని గ్రహించగలరనుకుంటాను.

మనమంతా మానవులం. ఒక సంఘంగా బ్రతకాల్సినవాళ్ళం. ఈ విషయం తెలుసుకున్నతరువాత ఒకరి నొకరం అర్థంచేసుకోగలం. మీ ప్రవర్తనలో అసహజం ఏమీలేదు. కాగా. మీమీద నాకేమీ కోపంలేదని చెప్పటం అనవసరమే నేమో.

సెలవు

మీ

వరదరాజు.

ఉత్తరం పోస్టుచేసి తేలికపడ్డ హృదయంతో వరదరాజు ఊరుబయటికి నడిచాడు. ఎంతోసేపు అలా తిరిగాడు ఆ చీకట్లో. తిరిగి తిరిగి రైలుపట్టాల దగ్గిరికి చేరుకున్నాడు. నక్షత్రాల కాంతిలో పట్టాలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. వాటివైపు చూసి విషాదపూరితంగా చిన్నగా నవ్వాడు అతను. దూరాన ఏదో రైలు వస్తున్న సవ్వడి వినిపించింది. తాటిచెట్ల సందుల్లోంచి 'లైట్' కనిపిస్తోంది. పట్టాల మీదఅడ్డంగా పడుకున్నాడు వరదరాజు. ఇప్పుడతనికేమీ విచారంలేదు. రాధకి రేపో, ఎల్లుండో ఈ సంగతి తెలియక మానదు. తన ప్రవర్తనకి పశ్చాత్తాప పడుతుంది. వరదరాజు నమ్మక ద్రోహి కాడు. ఈ ఆలోచన అతని కెంతో ఉత్సాహం కలిగించింది. తన నిర్దోషిత్వం ఋజువవుతుంది. వరదరాజు మాట తప్పని పెద్దమనిషి! వాగ్దానం తీర్చుకోటంకోసం ప్రాణత్యాగం చేసిన త్యాగి.

రైలు చాలా దగ్గిరకి వొచ్చేసింది. తనని ఎవరూ చూడరు గద! అతనికి అకస్మాత్తుగా ఒక సందేహం పట్టుకుంది. తనుచావంటే భయపడటం లేదు. ఎందుకు? ఎప్పుడెప్పుడు ఆ ముహూర్తం దగ్గిర పడుతుందా అని కనిపెట్టుకున్నాడు. తన పిరికితనం ఏమయింది? రైలు చాలాదగ్గిరికి వొచ్చేసింది. ఇహ కొద్దినిమిషాలు, కొద్దిక్షణాలు. అయినా తనకేమాత్రం భయంలేదు చిత్రం. ఏమిటి కారణం? తను మొదట ప్రేమించి విఫలుడైనప్పుడు ఆత్మహత్య తల

చెప్పలేక పోయాడు. అసలు ఆ ఊహే అతని మెదడులో ప్రవేశించలేదు రెండోసారి రాధకోసం చావలేకపోయాడు. తన మరణంవల్ల ఆమె బాగు పడుతుందని తెలిసీ తను సాహసించలేకపోయాడు. అయితే ఇప్పుడామె తనని నిరాకరించటంవల్ల ఆశలడుగంటి విరాగిఅయి మృత్యువుని ఆహ్వానిస్తున్నాడా? ఆ కారణంవల్ల తను ఆనిశ్చయానికి రాలేదు. కేవలం తన ఆత్మగౌరవం కాపాడు కోవటంకోసం-అవును కేవలం అందువల్లే తను చచ్చిపోతున్నాడు. రాధకోసం కాదు. హఠాత్తుగా అతని మెదడులో ఏదో ఆలోచన మెరసింది. ఏదో నగ్న సత్యం ఎవరో చెవిలో చెప్పినట్టయింది. ఇన్నాళ్ళనించీ తెలుసుకోలేక పోయాడు. తన నరనరాల్లో ఇలా...

రైలు తనమీదికి ఉరకబోతోందని అదే క్షణంలో గ్రహించాడు వరదరాజు. యంత్రంలా లేచి ఒక్క గంతువేశాడు. కాని ఇంజన్ తాకిడికి బలంగా తోసివేయబడి చాపచుట్టగా పడిపోయాడు. తెలివితప్పిపోయింది.

మళ్ళీ తెలివివచ్చేసరికి వరదరాజు గవర్నమెంట్ హాస్పిటల్లో 'బెడ్' మీద ఉన్నాడు. వొంటినిండా పట్టీలున్నాయి. తను చావలేదన్నమాట. ఒక ధీర్ఘనిశ్వాసం తరవాత తల పక్కకి తిప్పిచూశాడు అతను తనకళ్ళని తను నమ్మలేకపోయాడు. ఎదురుగా రాధఉంది. ఆశ్చర్యంగా అలాగే ఆమెవైపు చూడసాగాడు. ఆమెముఖం పాలిపోయి ఉంది. వరదరాజు కళ్ళుతెరచి తనవైపు చూడటంతో ఆమెముఖంలో సంతోషం తాండవమాడింది.

“ఎలా ఉంది?” మృదువుగా అడిగిందామె.

“బాగానే ఉంది” అన్నాడు తనగొంతు తనకే వినిపించలేదు సరిగా.

“నన్ను క్షమించండి” ఆమె వరదరాజుని వేడుకుంటూ అంది. వరదరాజు జరుగుతున్నది అర్థంచేసుకోలేకుండా ఉన్నాడు. రాధ తనని ప్రథమంగా వేడుతుంది. స్వర్గలోకంలో విహరిస్తున్నట్టుగా అనుభూతిపొందాడు. ఏమీ మాట్లాడలేకపోయాడు.

“మిమ్మల్ని అనరానిమాటలు అన్నాను. నా కేమీ తెలియదు. మూర్ఖురాల్ని, ఎంతో బాధించాను. మీ మనసు గ్రహించలేకపోయాను.”

ఈ సారి వరదరాజు భావయుక్తంగా చిన్నగా నవ్వాడు. “నా మనసు నేనే గ్రహించలేకపోయాను చివరిదాకా. నన్ను గురించి నాకు తెలుసునని అనుకుంటూఉండేవాణ్ణి. అది శుద్ధపొరపాటని తేలింది”

రాధ అర్థంకాక ఏమిటన్నట్టుగా అతనివైపు చూసింది.

"నిన్ను గురించిన నిజాలు ఎప్పటికప్పుడు నాకు కొత్తగా అవగత మవుతుంటే, అసలు నన్ను గురించి నాకేమీ తెలియదని ఒప్పుకోవాలిసి వొస్తోంది. నేను జీవచ్ఛవంలా బతుకుతున్నాననుకున్నాను. కోరికలేమీ లేవను కున్నాను. ఇహ స్వార్థంమటుకు ఉంటుందని ఎలా అనుకుంటాను? కాని మొదటినుంచీ చివరిదాకా నేను నాకోసమే బ్రతుకుతున్నాననీ, స్వార్థచింతన అత్యధికంగా ఉందని చివరినిమిషంలో తెలుసుకున్నాను. భగ్నజీవితం గడుపు తున్నా, ఒకరి మేలుకోసం నా ప్రాణం ఇవ్వలేకపోయాను. చివరికి నా గౌరవంకోసం, నా గొప్పతనం నిరూపించుకోటంకోసం - అంటే నాకోసం నేను ప్రాణం పోగొట్టుకోగల స్థితికి వచ్చాను."

రాధకి ఇదంతా కొత్తవిషయంగా కనిపించలేదు. ప్రపంచంలో పూర్తిగా అమలులోఉన్న విషయంగురించి అతనంతగా ఎందుకు బాధపడు తున్నాడో తెలియలేదు. ఏమీ అనకుండా అతనివైపు చూస్తూ వూరుకుంది కాసేపటి తరువాత అతనడిగాడు.

"నేను ఇక్కడ ఉన్నానని మీకెలా తెలిసింది?"

"నేను మీ భార్యని. 'నువ్వు' అనండి."

వరదరాజు ఆమెవైపు తేరిపారచూశాడు.

"కాని..."

గిర్రున తిరిగిన కన్నీటితెరలోంచి ఆమె అతనివైపు చూస్తూ వేడు కోలుగా అన్నది.

"నేను చేసింది క్షమించరాని తప్పే అనుకోండి, కాని..."

"అదికాదు. సరే, అసలు ఇక్కడికి రావటం ఎలా సంభవించింది?"

"మీ ఉత్తరం చదివి నా తప్పిదం తెలుసుకున్న తరవాత మనసు ఎంతో సంక్షోభం చెందింది. బయట ఎవరో కుర్రాళ్లు అనుకుంటూ వెడు తున్నారు. రాత్రి రైలుకింద ఎవరో పడ్డారనీ, జనరల్ హాస్పిటల్‌కి తీసు కొచ్చారనీ, ఇహ ఎవరై ఉంటారనుకుంటాను?"

వరదరాజు కొంచెంసేపు విశ్రాంతి తీసుకుని అన్నాడు.

"మీకో ముఖ్యవిషయం చెప్పాలి."

"మల్లీ..." జాలిగా అతనివైపు చూసిందామె.

సరే; అనను. అసలా విషయం చెప్పటానికే బతికాను. ఆఖరినిమిషంలో తట్టింది—బహుశా నేను ఎవర్నీ ఇంతవరకు ప్రేమించలేదేమో. రాధని కూడా..."

అతనామెవైపు చూశాడు. ఆమె ముఖభంగిమలో మార్పు ఏమీలేదు.

"ఏ మాత్రం ప్రేమించిఉన్నా అలా ఉత్తరం రాయకలిగిఉండేవాణ్ణి కాదు. ఆ ఉత్తరం చాల బాధ కలిగిస్తుందని నాకు తెలుసు. జీవితాంతం మస్వప్నంలా వెంటపడుతుందని తెలుసు. అయినా అలా రాయకలిగాను. కసి లేదనకుని నన్ను వంచించుకో దలచాను. కాని నా మనసుని నేనే వంచించాను. నా అంతరాంతరాలకీ నాకూ మధ్య ఎన్నో తెరలున్నాయి. రాధా, నీ మీద కోపగించననీ, కోపగించటానికి అధికారం లేదనీ నిశ్చయించుకున్నాను. కాని ఎక్కడో నా మనసులో ఏ మూలో నీ మీద కోపం కసి ఆరని దీపాల్లాగా మిణుకుమిణుకుమంటూ ఉన్నాయి. లేకపోతే అలా రాయటం నా తరమై ఉండేదికాదు. ఇహ ప్రేమిస్తున్నానని ఎలా అనగలను? ఈ నిజం చెప్పేదాకా బతకాలని కోరుకున్నాను. బతికాను. మనసు చాలా తేలికగా ఉంది, ఈ క్షణం."

ఇంత సుశితంగా విమర్శించుకుంటున్న వరదరాజుని చూసి రాధకి విస్మయంతోటాటు జాలికూడా కలిగింది. ఒకక్షణం ఆగి చిన్నగా నవ్వుతూ అన్నది.

"ప్రేమ అంటే ఏమిటి?"

ఏదో చెప్పవచ్చు. కాని వరదరాజు వెంటనే ఏదీ చెప్పలేకపోయాడు. ఏం చెప్పాలో ఆలోచించ సాగాడు.

"ప్రేమ అంటే ఏమిటో సరిగా తెలియకుండానే, అది లభ్యంకాలేదని హిమాలయాలకు వెళ్ళిపోవాలనుకుంటారా ఎవరైనా? ఎంత అమాయకులండీ?"

రాధ ముసిముసిగా నవ్వింది, అతనామెవైపు తదేకంగా చూశాడు. అప్రయత్నంగా నవ్వాడు హార్దికంగా వెన్నెల వెలుగులా, తేలికగా, హాయిగా. జీవితంలో అలా నవ్వటం అతనికి బహుశా అదే మొదటిసారేమో బుద్ధితెలిసిన

తరవాత! కాని మరి కొంచెం సేపటిలోనే అతనికో సందేహం కలిగింది. సూటిగా అడగదలుచుకున్నాడు.

"మరి..."

కాని రాధ అతన్ని మాట్లాడనియ్యలేదు. ఎక్కువగా మాట్లాడటం అంత మంచిదికాదని నోరు మూసేసింది.

తను ఆమెని ప్రేమించాడని అన్నప్పుడు తిరస్కరించి యిప్పుడు ప్రేమించటంలేదని పరిస్థితి వ్యక్తంచేసినప్పుడిలా ఆమె ప్రవర్తించటంలో గల అంతర్యం ఏమిటా అనే ప్రశ్న వరదరాజుకి కొంచెం సేపటి వరకూ సమస్య గానే తోచింది.